రాజ్యాంగం.. ప్రాథమిక స్వరూప సిద్ధాంతం

'ప్రా'థమిక హక్కులు, ఆదేశ సూత్రాల ప్రాముఖ్యం' విషయంలో మొదట్నుంచీ పార్లమెంటు, సుప్రీంకోర్టు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చుతూనే ఉన్నాయి. పార్లమెంటు..ఆదేశసూత్రాలకు ప్రాధాన్యమిస్తూ, వాటి అమలు కోసం ప్రాథమిక హక్కుల పరిధిని పరిమితం చేయడానికి కూడా వెనుకాడలేదు. ఈ క్రమంలో... మొదటి రాజ్యాంగ సవరణ చట్టం(1951) ఆస్తిహక్కును పరిమితం చేసింది. తొమ్మిదో షెడ్యూల్ ను చేర్చడం ద్వారా న్యాయ వ్యవస్థ సమీక్షాధికారాన్ని పరిమితం చేసింది. అయితే గోలక్‌నాథ్ కేసు(1967) విచారణ వరకు పార్లమెంటుకున్న రాజ్యాంగ సవరణ అధికారాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించలేదు. గోలక్‌నాథ్ కేసులో మెజారిటీ న్యాయమూర్తులు.. పార్లమెంటుకు 368 వ రాజ్యాంగ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే ఆ అధికారం ఉందన్నారు. న్యాయమూర్తుల దృష్టిలో రాజ్యాంగ సవరణ కూడ చట్టమే కాబట్టి రాజ్యాంగ ప్రకరణ 13(2) మేరకు ''ప్రాథమిక హక్కులను పరిమితం చేసే లేదా తొలగించే ఏ చట్టమైనా చెల్లదు.''

గోలక్‌నాథ్ కేసులో ఇచ్చిన తీర్పును అధిక్రమణ చేయడానికి, పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా (1971) 368వ ప్రకరణను సవరించింది. దీని ప్రకారం ''రాజ్యాంగ సవరణకు చేసిన చట్టాలు 13(2) ప్రకరణ కింద చెల్లవని ప్రకటిం చడానికి వీల్లేదు.'' 368వ ప్రకరణ కింద చేసిన రాజ్యాంగ సవరణ 13వ ప్రకరణలోని అంశాలకు వర్తించదు. 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని కేశవానందభారతి కేసు (1973)లో సవాలు చేసింది. ఈ కేసులో ఒకవైపు పార్లమెంటుకు ప్రాథమిక హక్కులు సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించే అధికారముందని ఒప్పుకుంటూ.. మరోవైపు ''368వ ప్రకరణ రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చే హక్కు పార్లమెంటుకు ఇవ్వలేదని'' తీర్పు నిచ్చింది. దీన్నే రాజ్యాంగ ప్రాథమిక స్వరూప సిద్ధాంతంగా వర్ణిస్తున్నారు. కేశవానందభారతి కేసులో తీర్పునిచ్చిన న్యాయ మూర్తుల్లో ఒకరైన జస్టిస్ సిక్రి రాజ్యాంగ ప్రాథమిక స్వరూప లక్షణాలను పట్టికా బద్ధం (Tabulate) చేయడానికి ప్రయత్నించారు.

సిక్రి అభిప్రాయంలో రాజ్యాంగ ప్రాథమిక స్వరూప లక్షణాలు:

1. రాజ్యాంగ సర్వోన్నతం
2. గణతంత్ర లేదా ప్రజాస్వామ్య ప్రభుత్వం
3. రాజ్యాంగ లౌకిక స్వభావం
4. అధికార పృథఃకరణ (separation of powers)
5. రాజ్యాంగ సమాఖ్య లక్షణం

ఇదే కేసులో పాల్గొన్న న్యాయమూర్తి హెగ్డే, న్యాయమూర్తి ముఖర్జీ మరికొన్ని అదనపు లక్షణాలను రాజ్యాంగ ప్రాథమిక స్వరూప లక్షణాలుగా పేర్కొన్నారు. అవి...

1. భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
2. మన రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామ్య లక్షణం



3. వ్యక్తి స్వేచ్ఛ

ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1976)లో తీర్పు నిస్తూ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి చంద్రచూడ్ కింది అదనపు లక్షణాలను రాజ్యాంగ ప్రాథమిక స్వరూప సిద్ధాంతంలో భాగంగా గుర్తించారు. అవి...

1. ఇండియా ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగం
2. సమాన హోదా, సమాన అవకాశాలు
3. లౌకికతత్వం, అంతరాత్మ స్వాతంత్ర్యం
4. సమన్యాయం

ఆయనే... మినర్వామిల్స్ కేసులో (1980) మరికొన్ని అంశాలను చేర్చారు. అవే:

1. పార్లమెంటుకున్న రాజ్యాంగ సవరణాధికారం
2. న్యాయసమీక్ష
3. ప్రాథమికహక్కులు, ఆదేశసూత్రాల మధ్య సమతౌల్యత

న్యాయమూర్తి చంద్రచూడ్ అభిప్రాయంలో... 'రాజ్యాంగ పీఠిక ప్రాథమిక స్వరూపానికి మూలం కాదు'. కానీ.. న్యాయమూర్తి బేగ్ అభిప్రాయంలో పీఠిక ప్రాతిపదికగా రాజ్యాంగ సవరణలు సక్రమమైనవో కాదో పరీక్షించవచ్చు. రాజ్యాంగ సవరణలకు కొలబద్ధ పీఠికే!

అయితే 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) రాజ్యాంగ మౌలిక స్వభావ సిద్ధాంతాన్ని నీరుగార్చడానికి ప్రయత్నించింది. 368వ ప్రకరణకు చేర్చిన 4, 5 క్లాజుల ప్రకారం:

1) 368 (1) నిబంధన ప్రకారం పార్లమెంటుకు సంక్రమించిన రాజ్యాంగ సవరణ అధికారంపై ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష పరిమితులుండవు.
2) రాజ్యాంగ సవరణ చట్టం ఏ కారణం చేతనైనా న్యాయ సమీక్ష పరిధిలోకి రాదు.

కానీ మినర్వామిల్స్ కేసులో (1980) సుప్రీంకోర్టు రాజ్యాంగ ప్రాథమిక స్వరూప సిద్ధాంతాన్ని మళ్లీ పునరుద్ఘాటించింది. 368వ ప్రకరణకు చేర్చిన 4, 5 క్లాజులు చెల్లనేరవని తీర్పునిచ్చింది. ఎందుకంటే.. ఇవి ప్రాథమిక లక్షణాల్లో ఒకటైన న్యాయ సమీక్ష అధికారాన్ని తొలగిస్తున్నాయి. కేశవానందభారతి కేసులో ప్రతిపాదించిన ప్రాథ

మిక స్వరూప సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టు తలకిందులు (over turn) చేయనంతవరకు, ఏ రాజ్యాంగ సవరణనైనా... ప్రాథమిక స్వరూప సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఉంద నే కారణంతో తోసిపుచ్చవచ్చు.

అత్యవసర పరిస్థితులు:

సమాఖ్య వ్యవస్థలో జాతీయ, ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య అధికార విభజన జరుగుతుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ రెండు ప్రభుత్వాలు సమాన ప్రతిపత్తి కలిగి ఉన్నప్పటికీ, అసాధారణ పరిస్థితులు తలెత్తితే దేశ సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం విశేషాధికారాలను ఉపయోగిం చాల్సి వస్తుంది. రాజ్యాంగంలో ప్రస్తావించిన అత్యవసర అధికారాలు యూనియన్ ప్రభుత్వానికి ఏకకేంద్ర ప్రభుత్వంలా వ్యవహరించే అవ కాశాన్నిస్తున్నాయి. రాజ్యాంగంలో 3 రకాల అసాధారణ పరిస్థితుల్ని పేర్కొన్నారు.

1. యుద్ధం, విదేశ దురాక్రమణ, సాయుధ తిరుగుబాటు. దీన్ని ''జాతీయ అత్యవసర పరిస్థితి'' అంటారు. (352వ ప్రకరణ)
2. రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధ యంత్రాంగం విఫలం కావడం (356 వ ప్రకరణ). దీనినే'రాష్ట్రపతి పాలన'గా మీడియా ప్రచారంలో కి తెచ్చింది.
3. ఆర్థిక సంక్షోభం (360వ ప్రకరణ)

జాతీయ అత్యవసర పరిస్థితిని మంత్రిమండలి లిఖిత పూర్వక సలహా మేరకు రాష్ట్రపతి ప్రకటిస్తారు. ఈ ప్రకటనను పార్లమెంటు నెల రోజుల్లోగా ప్రత్యేక మెజారిటీ ద్వారా ఆమోదించాలి. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత ఆ అత్యవస పరిస్థితి ఆరు నెలల వరకు అమల్లో ఉంటుంది. అవసరాన్ని బట్టి ప్రతి ఆరు నెలలకోసారి పార్ల మెంటు అనుమతితో నిరవధికంగా కొనసాగించవచ్చు. ఇది అమల్లో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయవచ్చు. అంటే కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వహణాధికార పరిధి విస్తృ తమవుతుంది. లోక్‌సభ, విధానసభల పదవీ కాలాన్ని ఒక ఏడాది పాటు (ఐదేళ్ల నుంచి ఆరేళ్లకు) పొడిగించవచ్చు. ఆపై, అవసరాన్ని బట్టి సంవత్సరానికోసారి పార్లమెంటు తీర్మానం ద్వారా పొడిగించ వచ్చు. అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్న కాలంలో ఏడో షెడ్యూల్‌లో పొందుపరచిన అన్ని అంశాల మీద (యూనియన్, రాష్ట్ర, ఉమ్మడి జాబితా) చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు... కేంద్ర- రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను క్రమబద్ధం చేసే 268-279 ప్రకరణలకు సంబంధించిన అంశాలను సవరించే అధికారం రాష్ట్రపతికి సంక్రమి స్తుంది. ఈ పరిస్థితుల్లోనే ప్రాథమిక హక్కుల అమలును తాత్కాలికం గా నిలిపివేయవచ్చు. వాటి అమలుకు సంబంధించిన రిట్లను జారీ చేసే అధికారం న్యాయస్థానాలకు తాత్కాలికంగా ఉండదు. అయితే 20, 21వ ప్రకరణల్లోని హక్కులను మాత్రం నిలిపేయడానికి వీల్లేదు.

352వ ప్రకరణ కింద అత్యవసర పరిస్థితిని మొదటిసారిగా 1962 లో... నీఫా ప్రాంతం చైనా దురాక్రమణకు గురైన నేపథ్యంలో ప్రకటిం చారు. 1968లో రద్దు చేసారు. 1971లో భారత్- పాకిస్తాన్ మధ్య సంభవించిన యుద్ధం నేపథ్యంలో రెండో సారి జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించారు. 1975లో ఇంది రాగాంధీ ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు మూడోసారి అత్యవసర పరిస్థితి ప్రకటనకు దారితీసింది. అయితే దీన్ని 'అంతర్గత అలజడుల' కారణం గా విధించారు. 1977లో రద్దు చేసారు. 44వ సవరణ 'అంతర్గత అల జడుల' స్థానంలో 'సాయుధ తిరుగుబాటు' అను సమాసాన్ని చేర్చింది. ఈ సవరణ ప్రకారం అత్యవసర పరిస్థితి ప్రకటన సమీక్షకు గురవుతుంది.

రాజ్యాంగ బద్ధంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా కొన సాగలేని అసాధారణ పరిస్థితి తలెత్తినప్పుడు, సంబంధిత గవర్నరు నివేదిక ఆధారంగా (నివేదికతో నిమిత్తం లేకుండా కూడా)... మంత్రి మండలి సలహా మేరకు 356వ ప్రకరణ కింద రాష్ట్రంలో అసాధారణ పరిస్థితి నెలకొందని రాష్ట్రపతి ప్రకటించవచ్చు. దీన్ని పార్లమెంటు రెండు నెలల్లోపు సాధారణ మెజారిటీతో ఆమోదించాలి. 1994లో సుప్రీంకోర్టు బొమ్మై కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం... పార్లమెంటు ఆమోదం పొందే వరకు రాష్ట్ర శాసనసభను రద్దు చేయకూడదు. రాష్ట్ర మంత్రిమండలిని రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన కిందకు వస్తుంది. 44వ రాజ్యాంగ సవరణ చట్టం నిబంధనల మేరకు సుప్రీం కోర్టుకు అసాధారణ పరిస్థితి ప్రకటనను సమీక్షించే అధికారం సంక్ర మించింది. పార్లమెంటు ఆమోదించిన ఆరు నెలల వరకు 356వ ప్రక రణ కింద చేసిన ప్రకటన అమల్లో ఉంటుంది. అవసరాన్ని బట్టి పార్ల మెంటు ఆమోదం మేరకు మరో ఆరు నెలల వరకు రాష్ట్రపతి పాలనను పొడిగించవచ్చు. మొత్తం మీద ఒక సంవత్సర మొత్తం లేదా ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం పొడిగించాలంటే...

1. ఆ రాష్ట్రంలో పూర్తిగా లేక కొంత భాగంలో 352వ ప్రకరణ కింద అత్యవసర పరిస్థితి అమల్లో ఉండాలి.
2. ఆ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణకు అను కూల వాతావరణం లేదని ఎన్నికల సంఘం ధ్రువీకరించాలి.

ఈ రెండు షరతుల మేరకు రాష్ట్రపతి పాలనను గరిష్టంగా మూడేళ్ల వరకు పొడిగించవచ్చు. ఆ తర్వాత కూడా కొనసాగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి. ఈ విధంగానే జమ్మూ-కాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో మూడేళ్ల కంటే ఎక్కువ కాలం రాష్ట్రపతి పాలన కొనసాగింది. 356వ ప్రకరణ అమల్లో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు కేంద్రం బాధ్యత వహిస్తుంది. ఆ రాష్ట్రానికి చెందిన బిల్లులు, బడ్జెట్‌ను పార్ల మెంటు ఆమోదిస్తుంది. ఇప్పటివరకు ఈ ప్రకరణను 110సార్లకుపైగా ఉపయోగించింది. ఎక్కువ సందర్భాల్లో ఇది దుర్వినియోగమైంది. బొమ్మై కేసులో సుప్రీం తీర్పు కొంత వరకు ఈ దుర్వినియోగాన్ని అరి కట్టింది. 360వ ప్రకరణ కింద ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు రాష్ట్ర పతి మంత్రిమండలి సలహా మేరకు ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటిం చవచ్చు. పార్ల మెంట్ దీన్ని రెండు నెలల్లోపు సాధారణ మెజారిటీతో ఆమోదిం చాలి. దీన్ని నిరవధికంగా కొనసాగించవచ్చు. ప్రతి ఆర్నెళ్లకో సారి పార్లమెంట్ దీన్ని ఆమోదిస్తూ తీర్మానం చేయాల్సిన అవసరం లేదు. ఇది అమల్లో ఉంటే పొదుపు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన ఉత్తర్వులివ్వవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ

ఉద్యోగుల జీతభత్యాల్లో కోత విధించవచ్చు (సు ప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలతో సహా). రాష్ట్ర ద్రవ్యబిల్లులను, రాష్ట్రపతి అనుమతి మేరకు శాసనసభలో ప్రవేశపెట్టాలి. ఇప్పటివరకు దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించలేదు.

ముఖ్యాంశాలు

- 368వ ప్రకరణ కింద చేసిన రాజ్యాంగ సవరణ 13వ ప్రకరణలోని అంశాలకు వర్తించదు.
- 352వ ప్రకరణ కింద అత్యవసర పరిస్థితిని మొదటిసారిగా 1962లో... నీఫా ప్రాంతం చైనా దురాక్రమణకు గురైన నేపథ్యంలో ప్రకటించారు.
- 1971లో భారత్–పాకిస్తాన్ మధ్య సంభవించిన యుద్ధం నేపథ్యంలో రెండోసారి జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించారు.
- 1975లో ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు మూడోసారి అత్యవసర పరిస్థితి ప్రకటనకు దారితీసింది.
- 356వ ప్రకరణ అమల్లో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు కేంద్రం బాధ్యత వహిస్తుంది. ఆ రాష్ట్రానికి చెందిన బిల్లులు, బడ్జెట్‌ను పార్లమెంటు ఆమోదిస్తుంది. ఇప్పటివరకు ఈ ప్రకరణను 110సార్లకుపైగా ఉపయోగించింది.
- 360వ ప్రకరణ కింద ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు రాష్ట్రపతి మంత్రిమండలి సలహా మేరకు ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటించవచ్చు.